

ఫిజియోథెరపీ వైపు ప్రజల చూపు

ఫిజియోథెరపీ ద్వారా వైద్యం అందిస్తే శారీరక సంవృద్ధి,శక్తి పొందొచ్చు. జీవనశైలి సజావుగా సాగడానికి ఉపయోగపడుతుంది. -8లో..



రైల్వే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కడప రైల్వే స్టేషన్‌లో ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ అన్నారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/24.3

జిల్లాలో గురువారం 24.3 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

గండిలోకి వాహనాలకు అనుమతిలేదు

చక్రాయపేట: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా గండిలోకి ఎలాంటి వాహనాలను అనుమతించే ప్రసక్తే లేదని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి పేర్కొన్నారు. వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన తెలిపారు. ద్విచక్రాల వాహనాలను సైతం అనుమతించేది లేదన్నారు. ఈవిషయంలో ప్రతి వ్యక్తి పోలీసులకు సహకరించాలని చెప్పారు.రాయచోటి వైపునుంచి వచ్చే వాహనాలు అద్దాలమర్రి క్రాస్ వద్ద, వేంపల్లె వైపు నుంచి వచ్చే వాహనాలను ఇడుపులపాయ క్రాస్ వద్దే ఆపేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ ఎస్సై రంగారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



రాము

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీలోని ట్రిపుల్ ఐటీలో రసాయనశాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బొలిశెట్టి రాము అనంతపురం జిల్లా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. ప్రొఫెసర్ సుధాకర్‌బాబు పర్యవేక్షణలో 'సింథసిస్' క్యారెక్టరైజేషన్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూయేషన్ ఆఫ్ న్యూ స్కిప్ బేస్ మెటల్-కాంప్లెక్స్' అంశంపై డాక్టరేట్ పట్టా దక్కిందని పేర్కొన్నారు. ఏఓ రాంభూపాల్‌రెడ్డి, డీన్ సి.రత్నకుమారి, అధ్యాపక బృందం ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీ

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు ఎనిమిదో తరగతి పాసై ఉండాలన్నారు. 40 ఏళ్ల గరిష్ట వయసున్న వారు ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, తీసుకుని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా ఉచితంగా దరఖాస్తులు పంపవచ్చునన్నారు. ఈ నెల 19 వరకు దరఖాస్తుల స్వీకరణ, 20న పరిశీలన ఉంటుందన్నారు.

వలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

కడప సెవెన్ రోడ్స్: జిల్లాలోని 35 మండలాలు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న 146 గ్రామ, వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నోటిఫికేషన్ విడుదల, 12, 13వ తేదీల్లో దరఖాస్తుల స్వీకరణ, 14న పరిశీలన ఉంటుందన్నారు. 15, 16వ తేదీల్లో ఎంపిక కమిటీ సభ్యులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ నెల 17న ఎంపికైన వారికి సమాచారం అందిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు..

కడప కల్చరల్: వైఎస్ఆర్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖలో మెడికల్ ఆఫీసర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రత్యేకాధికారి జి.శివశంకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను కడప నగరం మట్టి పెద్దపులివీధి వద్ద రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయానికి చేరేలా పంపాలన్నారు. పూర్తి వివరాలకు 08562-272829 లేదా 9494170777, 9154773114 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఎంపికైన వారికి రూ.30వేల వేతనం ఉంటుందని కలెక్టర్ అధ్యక్షతన అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. బ్లడ్ గ్రూపింగ్ సిరాలజీ, మెథడాలజీ, కాంపొనెంట్స్ ప్రిపరేషన్ చేయగలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.5 లక్షల విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,50,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన బీకేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి రు.1,00,116, తమిళనాడు రాష్ట్రం ఈరోడ్ పట్టణానికి చెందిన హంచాటే లక్ష్మణరావు రు.50 వేలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలచే స్వామికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసినట్లు చెప్పారు.

వంతెన పనులు చకచకా



పెన్నానదిపై నిర్మాణంలో ఉన్న హైలెవెల్ బ్రిడ్జి

- రామేశ్వరం వద్ద పెన్నానదిపై వంతెన
- రూ.53 కోట్లతో పనులకు సీఎం శంకుస్థాపన
- రైతుల నుంచి 4.5 ఎకరాల భూసేకరణ

ప్రొద్దుటూరు: పెన్నా నదిపై రాకపోకలకు జనం కష్టాలు వంతెన నిర్మాణంతో తీరనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించడంతో వంతెన పనులు చకచకా సాగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే ఆర్టీపీపీ, ముద్దనూరు, పులివెందుల ప్రాంతాలకు రాకపోకలు సులభమవుతాయి.

ప్రొద్దుటూరు సమీపంలో రామేశ్వరం వద్ద పెన్నా నదిపై వంతెన లేకపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతోంది. నదిలో నీరు ప్రవహిస్తే చుట్టూ చుట్టి రావాల్సి వస్తోంది. చాలామంది ప్రొద్దుటూరు మార్కెట్‌కు సరకుల కోసం వస్తారు. ప్రొద్దుటూరు నుంచి ఆర్టీపీపీ వైపు గ్రామాలకు వెళ్లాలంటే రామేశ్వరం వద్ద పెన్నానది దాటాల్సిందే. ఇల్లూరు, చిన్నదండ్లూరు ప్రాంతాల ప్రజలు పాలను అమ్మేందుకు ఇదే మార్గం. రామేశ్వరం ప్రాంత ప్రజలతోపాటు సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని వారికి నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీ పెన్నానదికి అటువైపు ఉంది. వర్షం లేని సమయాల్లో పెన్నానదిలోని గ్రావెల్ రోడ్డుపై వెళ్లే వీరంతా నదిలో నీరు చేరినప్పుడు రాకపోకలు నిలిచి నానా అగచాట్లు పడుతున్నారు. దీనికితోడు అధిక వర్షాలు, పలుమార్లు శ్రీశైలం నుంచి గండికోటకు, గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీరు విడుదల చేయడంతో పెన్నా నదిలో ఉధృతి పెరుగుతోంది. గ్రావెల్ రోడ్డు తెగిపోయి రాకపోకలు స్తంభిస్తున్నాయి.



రామేశ్వరం వద్ద పెన్నానదిపై చురుగ్గా సాగుతున్న హైలెవెల్ పెన్నానది బ్రిడ్జి నిర్మాణ పనులు

నదిపై వంతెన

జనం అవసరాలను దృష్టిలో పెట్టుకుని పెన్నానదిపై వంతెన నిర్మించి శాశ్వతంగా సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భావించారు. ఆయన కోరిక మేరకు 2021 డిసెంబర్, 23న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి రూ.53 కోట్ల నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్లు, టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ అనుమతుల అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. ఇరువైపులా అప్రోచ్ రోడ్లతోపాటు 1290 మీటర్ల పొడవునా పెన్నానదిపై హై లెవల్ వంతెన నిర్మిస్తున్నారు. నీటి ప్రవాహాన్ని తట్టుకునేందుకు వీలుగా 30 వెంట్లను నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 12 పూర్తయ్యాయి. 2024 ఆగస్టు నాటికి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే 4.50 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

పనులు వేగవంతం



పెన్నానదిపై హై లెవల్ బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. వంతెన నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించాం. పనుల నాణ్యతను నిత్యం పరిశీలిస్తున్నాం. నిర్మాణం పూర్తయితే ఎన్నో గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగుతుంది. భూ సేకరణ, జీఎస్టీ మినహా కాంట్రాక్టర్ రూ.34.68 కోట్లకు పనులు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.5.5 కోట్లు పనులు పూర్తి చేశారు.

– పి.లక్ష్మీనరసింహులు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, ప్రొద్దుటూరు

కురిసింది వర్షం..
పంటలకు జీవం



పచ్చగా కనిపిస్తున్న మిరపపంట

జిల్లాలో 28241 వేల హెక్టార్లలో పంటల సాగు

కడప అగ్రికల్చర్: ఖరీఫ్ ఆరంభంలో కురిసిన అరకొర వర్షాలకు రైతులు సాగు చేసిన పంటలకు జీవం వచ్చింది. పంట సాగైన తర్వాత నెల రోజులుగా వర్షం కురవకపోవడంతో ఎండుతాయని రైతులు ఆందోళన చెందారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలు పంటకు సంజీవనిగా పనిచేశాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 77,135 హెక్టార్లలో పంట సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకూ 28,241 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. మరో ఐదు వేల హెక్టార్లకు పెరిగే అవకాశం ఉంది. గత కొద్ది రోజులుగా వర్షం కురవక రైతులు దిగాలు చెందారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు వర్షం కురిసింది. ఎండుముఖం పట్టిన పంటలకు ప్రాణం లేచి వచ్చింది. జిల్లాలోని చక్రాయపేట, వేంపల్లి, వేముల, తొండూరు, వీఎన్‌పల్లె ప్రాంతంలోని చాలాచోట్ల వేరుసెనగ, పత్తి పంట దక్కదని అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షంతో పంట మళ్లీ చిగురించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెల	సాధారణ వర్షపాతం (మి.మీ.లో)	నమోదైంది (మి.మీ.లో)
జూన్	68.2	38.7
జులై	96.7	77.4
ఆగస్టు	118.4	42.3

జిల్లాలో సాగు చేసిన పంటల వివరాలు..

పంట	సాగైన భూమి (హెక్టార్లలో)
వరి	9181
పత్తి	8443
వేరుసెనగ	2410
కంది	1630
మినుము	1558
సోయాబీన్	1314
మొక్కజొన్న	893
మిరప	570
పసుపు	514
సజ్జ	264

సాగు విస్తీర్ణం పెరుగనుంది..



జిల్లాలో మూడు రోజుల కిందట కురిసిన వర్షంతో ఆరుతడి పంటలకు మళ్లీ ప్రాణం వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు భూములు పదును కావడంతో రైతులు ఆరుతడి పంటలైన మినుము, ఆలసంద, పెసర, ఉలవ సాగు చేస్తున్నారు. దీంతో జిల్లాలో సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి.

◆ వైభవంగా కృష్ణాష్టమి



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ, బలరాములు

స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. అనంతరం శ్రీకృష్ణ, బలరాముల విగ్రహాలను విశేషంగా పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భగవద్గీత పోటీలలో విజేతలకు అందజేశారు. అనంతరం రాత్రి 11 గంటలకు మహా హారతి నిర్వహించారు. 30 వేల మంది కిపైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.

–ప్రొద్దుటూరు కల్చరల్



కృష్ణాష్టమి వేడుకలకు హాజరైన భక్తులు

పంచాయతీ కార్యదర్శులపై సీఈఓ విచారణ



విచారణ చేస్తున్న జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు: జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు గ్రామ పంచాయతీ కార్యదర్శులపై జెడ్పీ సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎర్రగుంట్ల మండలం కలమల్ల పంచాయతీ కార్యదర్శి పి.సాంబశివారెడ్డి, డీపీఆర్సీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న టి.ఆమోష్, చాపాడులో పనిచేస్తున్న యు.ధనుంజయబాబు, రాజుపాళెంలో పనిచేస్తున్న ఎం.విజయలక్ష్మిలను విచారించారు. పంచాయతీ అనుతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మించారనే ఆరోపణలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఏఓలు రంగాచార్యులు, ఖాదర్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రగతి పరుగు

ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

చక్రాయపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని గ్రామాల్లో ప్రగతి పరుగు పెడుతోందని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్.అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్లూరుపల్లెలో సచివాలయ భవనాన్ని ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ వైఎస్.కొండారెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎంపీ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. కల్లూరుపల్లెలో భూ సమస్యలపై పలువురు విన్నవించగా ఆయన స్పందించి పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహశీల్దారు రాజసింహ నరేంద్రలను పిలిచి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కాలేటి వాగు ప్రాజెక్టు కింద భూములు ముంపునకు గురైతే పరిహారం అందలేదని, ఇతరుల ఖాతాల్లో మొత్తం జమ చేశారని తెలుపగా ఎంపీ స్పందించి ఎస్‌డీసీ చంద్రమోహన్‌ను పిలిచి పరిష్కరించాలని కోరారు. సోలార్ ప్రాజెక్టు కోసం భూములు తీసుకున్నారని, ఇపుడు సాగులో ఉన్నా పాస్ పుస్తకాలు ఇవ్వలేదని తెలుపగా రైతుల భూములు ఇప్పించాలని కోరగా కలెక్టర్‌తో ఎంపీ మాట్లాడి కొంత సమయం పడుతుందని, సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగరత్నమ్మ, మండల ఉపాధ్యక్షుడు గఫార్, వైఎస్ఆర్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, సభాపతినాయుడు, చలపతినాయుడు, జనార్ధనరెడ్డి , రాఘవ రెడ్డి, పుల్లారెడ్డి, పురుషోత్తం నాయక్, శంకర్ నాయక్, హరి, ఓబుళరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి, చక్రాయపేట ఎస్సై వినోద్‌కుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.



కల్లూరుపల్లె ప్రజాదర్బార్ కార్యక్రమంలో సమస్యలు వింటున్న వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ కొండారెడ్డి

అడ కాదు కుడ

కడప కార్పొరేషన్: అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అడ)ని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడ)గా మారుస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి వై. శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాగా ఉన్నప్పుడు పది నియోజకవర్గాలతో అన్నమయ్య అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(ఆడ) ఏర్పాటు చేశారు. పునర్విభజనలో ఏడు నియోజకవర్గాలు వైఎస్సార్ జిల్లాలో, మూడు నియోజకవర్గాలు అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. పద కవితాపితామహుడు అన్నమయ్య పేరు ఒక సంస్థకు ఉంచడంలో అర్థం లేదని ప్రజా ప్రతినిధులు సూచించడంతో ప్రభుత్వం పరిశీలించి, తుదకు కడప అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(కుడ)గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా కడప పేరు చెరిగిపోకుండా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

8న క్విజ్ పోటీలు

కడప ఎడ్యుకేషన్: ఏపీ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యాశాఖాధికారి నాగరాజు, డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. 8న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కడప మున్సిపల్ హైస్కూల్ పోటీలుంటాయని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా మరిన్ని సేవలు

కలెక్టర్ వి.విజయ్ రామరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా మరిన్ని వైద్య సేవలందిస్తున్నట్లు కలెక్టర్ వి.విజయ్‌రామరాజు అన్నారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జేసీ.గణేశ్ కుమార్, రెవెన్యూ డివిజన్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమం సచివాలయాల స్థాయి నుంచి అన్ని మండలాల్లో నిర్వహించాలన్నారు. ఈ నెల 8వతేదీ నుంచి ప్రారంభం కానున్న 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరై ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వైద్య శాఖ అధికారి డా.నాగరాజు, జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ హిమదేవి పాల్గొన్నారు.



సీసీఎల్ఏ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

మూడో దశ రీసర్వే వేగవంతం

కడప సెవెన్ రోడ్స్: భూ దస్త్రాల స్వచ్ఛీకరణకు మూడో దశ రీసర్వే వేగవంతం చేసినట్లు వేగంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. 'జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష' పథకం అమలుపై కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర భూ పరిపాలనా శాఖ కమిషనర్ సాయి ప్రసాద్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సీతాకోక చిలుక..కనులవిందు ఇక

'సీతాకోక చిలుకమ్మ.. లేలేత చిగురాకులమ్మ.. పారాడు పాపాయిలమ్మ.. పారేటి సెలయేరులమ్మ..' అంటూ సీతాకోక చిలుక అందం ఓ సినీ కవి వర్ణించారు. ప్రకృతిలోని అందాన్ని తన ఒంటిపై వేసుకుని అందరి కళ్లకు కనువిందుచేసే అరుదైన పర్యావరణ హితులు సీతాకోక చిలుకలు.. అలాంటి వాటిని చూసేందుకు యోగి వేమన విశ్వవిద్యాలయం వేదికగా మారింది.

వైవీయూలో మళ్లీ ప్రారంభమైన సీతాకోక చిలుకల పార్కు

వైవీయూ: జీవ వైవిధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది యోగి వేమన విశ్వవిద్యాలయం. ఈ విశ్వవిద్యాలయంలో ఇప్పటికే 20 ఎకరాల్లో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ అరుదైన, అంతరించిపోయే వృక్ష జాతులను సంరక్షిస్తుండగా, తాజాగా సీతాకోక చిలుకల పార్కును ఏర్పాటు చేయడం విశేషం. విశ్వ విద్యాలయ జంతుశాస్త్ర శాఖ అధ్యాపకుడు డాక్టర్ ఎస్.పి.వెంకటరమణ ఆధ్వర్యంలో 2010లోనే పార్కు ఏర్పాటు చేసినా కొంతకాలం తర్వాత వాటి నిర్వహణను నిలిపివేశారు. అయితే ప్రస్తుత వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యల ప్రోత్సాహంతో మళ్లీ ఈ పార్కు పునఃప్రారంభమైంది.



వైవీయూలోని సీతాకోక చిలుకల పార్కు



ప్రకృతి పరిరక్షణే ధ్యేయంగా

'సేవ్ నేచర్ అండ్ సేవ్ బటర్‌ఫ్లై' నినాదంతో ల్యాబొరేటరీల్లో (కాప్టివ్ బ్రీడింగ్) వాటిని వృద్ధి చేసి పంట పొలాల్లో విడుదల చేయడం ద్వారా ఫలదీకరణ ప్రక్రియ ఎక్కువగా జరుగుతుందని ఆచార్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా 2006లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈ ప్రక్రియను ప్రారంభించగా, 2010లో వైవీయూలో మోడల్ పార్కు ప్రారంభించారు. ఈ పార్కులో ముఖ్యంగా పైరిడ్, నింఫాలిడ్, పాపిలియోనిడ్, లిసినిడ్, హెస్పిరిడ్, యాక్రిడ్ కుటుంబాలకు చెందిన కెటొప్సిలియా, హైపోలిమన్నస్, ప్రిన్సెప్స్ డెమోలియుస్‌లు, రెసిసిప్టలు, టెర్సికస్‌కోర్‌లు, అధికసంఖ్యలో కనిపించే డానస్ క్రిసిపస్, యాప్లియోకోర్ రకం చిలుకలు ఎక్కువగా కనిపిస్తాయి.

కేరాఫ్ తూర్పుకనుమలు..

సీతాకోక చిలుకలు విశేషంగా కనిపించే ప్రాంతం తూర్పు కనుమలు. దాదాపు 151 విభిన్నమైన సీతాకోక చిలుకలను ఇక్కడ గుర్తించారు. 1994-2023 మధ్యపార్కు ఏర్పాటుచేసి సంరక్షిస్తున్నాం. వాటిపై పరిశోధనలు చేస్తున్నాం. నలుగురు పరిశోధనలు పూర్తిచేసి డాక్టరేట్ పొందారు.

– డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ, జంతుశాస్త్ర సహ ఆచార్యులు, వైవీయూ

● శభాష్.. ఎమ్మెల్యే సారూ

కుమార్తెకు ప్రేమ వివాహం చేసిన ఎమ్మెల్యే రాచమల్లు



కుమార్తె పల్లవితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజకీయ నాయకులు ఒకటి చెబితే.. మరొకటి చేయడం సర్వ సాధారణం. అత్యధికుల చర్యలు అదే రీతిలో కనిపిస్తాయి. అయితే ఇందుకు భిన్నంగా ప్రొద్దుటూరు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి శైలి ప్రస్ఫుటమైంది. తమ కుమార్తె ఆనందమే పరమావధిగా భావించిన ఆయన ఆమె కులాంతర వివాహం చేసి ఆదర్శంగా నిలిచారు. కుమార్తె ప్రేమించిన అబ్బాయితోనే మూడుముళ్లు వేయించి శభాష్ అనిపించారు. ప్రొద్దుటూరులో గురువారం జరిగిన ఈ సన్నివేశం చర్చనీయాంశమైంది. సమాజంలో కులమత భేదాలు పోవాలని చాలామంది చెబుతుంటారు. వారి వరకూ వచ్చేసరికి వెనకడుగు వేస్తారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పెద్ద మనసు కల్గి ఉండడంతోనే వివాహం చేశారని పలువురు కొనియాడుతున్నారు.

–సాక్షి ప్రతినిధి, కడప

రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని రైల్వేస్టేషన్ వద్ద గురువారం గుర్తు తెలియని వృద్ధుడు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి సుమారు 60–65 ఏళ్లు ఉంటాయని ఎర్రగుంట్ల రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కే రారాజు తెలిపారు. మృతుడు గోధుమ రంగు ఫుల్ షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడు. వృద్ధుడిని గుర్తు పడితే 9440627658 అనే సెల్ నంబర్‌కు సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు



మహిళను బంధువుకు అప్పగించిన పోలీసులు

కడప అర్బన్ : ఆత్మహత్యాయత్నాన్ని పోలీసులు అడ్డుకుని మహిళను కాపాడారు. కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన ఓ కుటుంబంలో కలహాలతో తల్లి, కుమార్తె(28)ను మందలించింది. కుమార్తె రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇంటిలో నిద్రమాత్రలు మింగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన మహిళ ఏడురోడ్ల కూడలిలో అనుమానాస్పదంగా వుండటంతో పోలీసులు గుర్తించారు. నైట్‌బీట్ విధుల్లో వున్న కడప ఒన్‌టౌన్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ శ్యాంసుందర్, ఒన్‌టౌన్ రక్షక్ ఇన్‌చార్జి ఏఎస్‌ఐ రవిరాయక్‌కు సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తరువాత ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ ఆసుపత్రిలో కోలుకుంటోంది. మహిళ ప్రాణాలు కాపాడిన ఏఎస్‌ఐ రవినాయక్, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్ సుందర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయంగా రైతులకు కావాల్సిన విత్తనాలను 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోందని ఉద్యాన శాఖ రాష్ట్ర సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి మైకేల్‌రాజీవ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా విత్తన కొరత లేదని, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. అలాగే రబీకి సంబంధించి ప్రభుత్వం ముందస్తుగానే విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. కావాల్సిన అన్ని రకాల విత్తనాలైన పెసర, మినుము, అలసందలు, ఉలవలు, కందులు, కొర్రలు వంటి సల్పకాలిక రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రెడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు విత్తనం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికే కొన్ని మండలాల్లో విత్తనాలకు రిజిస్ట్రేషన్ జరుగుతోందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వచ్చి తీసుకెళ్లాలన్నారు.

ఫిజియోథెరపీ వైపు.. ప్రజల చూపు

- రిమ్స్‌లో ప్రత్యేక విభాగం
- అవసరమైన వారికి విశేష సేవలు
- నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



కడప రిమ్స్‌లో ఫిజియోథెరపీ విభాగంలో చికిత్సలు అందిస్తున్న ఫిజియోథెరపిస్ట్‌లు



వైద్య సేవలు, సూచనలు అందిస్తున్న రిమ్స్ ఫిజియోథెరపీ హెచ్‌ఓడీ డాక్టర్ సంపత్‌కుమార్

కడప అర్బన్ : మానవ శరీరంలో నరాల పటుత్వం, కదలికలు తగ్గిపోయినా, కండరాల శక్తి, కీళ్ల విభాగాల నొప్పులు, సొంతంగా శారీరక పనులు చేసుకోలేని వారికి ఫిజియోథెరపీ ట్రీట్‌మెంట్ ఎంతో అవసరం. ఫిజియోథెరపీ ద్వారా వైద్యం అందిస్తే వారికి శారీరక సంవృద్ధి, శక్తి పొంది వారి జీవన శైలి సజావుగా సాగేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుత రోజుల్లో ఫిజియోథెరపీ ద్వారా ఇస్తున్న వైద్యం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. దీంతో ఈ విభాగంలో చికిత్స పొందాల్సిన వారంతా శ్రద్ధగా ముందుకు వస్తున్నారు. ప్రపంచంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను 1951లో కనుగొన్నారు. సెప్టెంబర్ 8ని 1996లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా ఎంచుకున్నారు. అప్పటి నుంచి ఏటా సెప్టెంబర్ 8న నిర్వహిస్తున్నారు.

- ఫిజియోథెరపీ (పి.టి) అనేది ఆరోగ్య సంరక్షణ వృత్తి. ఇది మసాజ్‌లు, హీట్ థెరపీ, వ్యాయామాలు, ఎలక్ట్రోథెరపీ, రోగి విద్య, గాయం, అనారోగ్యం లేదా వైకల్యానికి చికిత్స చేయడానికి సలహా వంటి వివిధ చికిత్సా విధానాలను కలిగి వుంటుంది. ఎవరైనా గాయం, అనారోగ్యం లేదా వైకల్యంతో ప్రభావితమైనపుడు కదలిక, పనితీరును పునరుద్ధరించుకోవడానికి సహాయపడుతుంది.
- కడప రిమ్స్‌లో వైద్యకళాశాల ప్రారంభం నుంచే ఆర్థోపెడిక్ విభాగానికి అనుబంధంగా ఫిజియోథెరపీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ప్రతి రోజూ ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చిన వారిలో 120– 150 వరకు వైద్య సేవలు పొంది ఉపశమనం పొందుతున్నారు. 30 మంది ఇన్‌ట్రినీలు ఇన్‌పేషెంట్ విభాగంలో వివిధ వార్డులకు హాజరై అవసరమైన వారికి వైద్య సేవలు, వ్యాయామ సూచనలు అందిస్తున్నారు. రోగి, వారి కుటుంబ సభ్యులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. శస్త్ర చికిత్స లేదా ఏదైనా రకమైన పక్షవాతం తర్వాత రోగుల పునరావాసంలో వారి పాత్రను వారే అర్థం చేసుకోవాలి.
- ఆస్టియో అర్థరైటిస్, మృదు కణజాల గాయాలు (ఘనీభవించిన భుజం, టెన్నిస్, ఎల్బో, అరికాలి అసౌకర్యాలు మొదలైనవి), రాడిక్యులోపతి, పోస్ట్ ట్రామాటిక్ గాయాలు, పునరావాసం, శస్త్రచికిత్స అనంతర పరిస్థితులు వంటి వివిధ అనారోగ్య పరిస్థితులతో బాధపడుతున్న రోగులు, రిమ్స్ ఫిజియోథెరపీ బృందం ద్వారా చికిత్స పొందుతున్నారు.
- కడప రిమ్స్‌లోని ఫిజియోథెరపీ విభాగంలో ఐ.ఎఫ్.టి, ఎస్.డబ్ల్యూ.డి, అల్ట్రాసౌండ్, ఎలక్ట్రికల్ స్టిమ్యులేటర్, ట్రాక్షన్, మైనపు చికిత్స ఇతరత్రా అన్ని రకాల ఎలక్ట్రోథెరపీ పరికరాలు చికిత్స చేయడానికి వున్నాయి.
- ఈ విభాగంలో వృద్ధాప్య, పీడియాట్రిక్స్ కేర్‌కు సంబంధించిన ప్రత్యేక శాఖలను కలిగి వుంది. ఈ శాఖలు ఫిజియోథెరపీ చికిత్స అవసరమయ్యే వృద్ధాప్య వయసు, పిల్లల వయసు వారికి ప్రత్యేక సంరక్షణను అందిస్తుంటారు.
- రిమ్స్‌లో 2021 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఫిజియోథెరపీ విభాగానికి వచ్చి వైద్య సేవలు పొందిన కొత్త, పాత రోగులు 16370 మంది వుంటారు. అలాగే 2022 జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు 23421 మంది ట్రీట్‌మెంట్ పొందారు. 2023 జనవరి నుంచి ఆగస్టు 31 వరకు 18720 మంది ట్రీట్‌మెంట్‌ను పొందారు.

రోగులకు ఉపశమనం కలిగించడమే ధ్యేయం

కడప రిమ్స్‌లో ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చిన రోగుల్లో ప్రత్యేకంగా ఫిజియోథెరపీ అవసరమైన వృద్ధులకు, పిల్లలకు, మహిళలకు వైద్య సేవలను తమ పరిధిలో నిర్వహించి ఉపశమనం కలిగించడమే ధ్యేయం. కొన్నేళ్లుగా ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించి తమకు ఆ విభాగంలో అవసరమైన సమయంలో ట్రీట్‌మెంట్‌ను తీసుకునేందుకు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ విభాగం ప్రాముఖ్యతను గుర్తించి తమవంతుగా సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా శుక్రవారం (8వ తేదీ)న కడప రిమ్స్‌లో రక్తదానం శిబిరం, ఇతర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

– డాక్టర్ సంపత్‌కుమార్, హెచ్‌ఓడీ, ఫిజియోథెరపీ విభాగం, జీజీహెచ్(రిమ్స్), కడప

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, వంశీకృష్ణయాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : యాదవులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక శ్రీరాముల పేటలోని తన కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి, ఏ ఇతర సహాయం అవసరమైనా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. తనకు ఇంత పేరు రావడానికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణాలయం నిర్మాణంలో తన తండ్రి ఆర్.వెంకటసుబ్బయ్య ముఖ్యపాత్ర పోషించారని ఆలయం, గోశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. విశాఖపట్నం ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పాలన కొనసాగుతోందన్నారు. జిల్లాలోనే ప్రథమంగా యాదవులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, చిలకల కృష్ణారెడ్డి, సూర్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలకు సర్వం సిద్ధం

నేడు ఎర్రగుంట్లకు రానున్న ఎంపీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్, పబ్లిక్ హెల్త్ కేంద్రం, పశువైద్యశాల భవనాలను శుక్రవారం కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అలాగే దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి గురువారం వీటిని పరిశీలించారు. అలాగే కమిషనర్ పి.జగన్నాథ్‌తో కలసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి ర్యాలీగా వచ్చి మొదట పశువైద్యశాలను ప్రారంభించి, తర్వాత నాలుగు రోడ్ల కూడలి మీదుగా వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్ర భవనాలను ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్ విగ్రహావిష్కరణలో పాల్గొంటారన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన



వైఎస్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లు పరిశీలించి మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి

ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను విగ్రహ దాత, సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి గురువారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలతో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ, పార్టీ నాయకులు యర్రంరెడ్డి వీరభద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలతో పాటు మున్సిపల్ ఆర్‌ఓ గంగిరెడ్డి, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..



మృతి చెందిన చిన్నారి హిమన్య





తీవ్రంగా గాయపడిన విష్ణు, స్వర్ణ

- ఆగి ఉన్న మినీ లారీని ఢీకొన్న కారు
- చిన్నారి దుర్మరణం
- ఐదుగురికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు/పులివెందుల రూరల్ : దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న మినీ లారీని కారు ఢీకొనడంతో.. ఓ చిన్నారి దుర్మరణం చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన నారాయణ స్వామి, విజయమ్మలు తమ కుమారుడైన కడపలో నివాసముంటున్న విష్ణు, స్వర్ణ కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని షిర్డీకి వెళ్లారు. పిల్లాపాపలతో కలిసి భక్తిశ్రద్ధలతో దేవున్ని దర్శించుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఔరంగబాద్ ఎయిర్ పోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు విమానంలో వచ్చారు. అక్కడి నుంచి కారులో స్వస్థలానికి బయలుదేరారు. మార్గంమధ్యలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెలోని ఓంశాంతి ఆశ్రమం వద్దకు రాగానే.. ఆగివున్న డీసీఎం వాహనాన్ని ఢీకొంది. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో చిన్నారి హిమన్య (16 నెలలు) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. నారాయణస్వామి, విజయ, విష్ణువర్ధన్, స్వర్ణలత, లౌక్య తీవ్రంగా గాయపడ్డారు. విష్ణువర్ధన్, స్వర్ణలతల కుమార్తెలు లౌక్య, హిమన్య. కారులో ఇరుక్కున్న నారాయణస్వామిని స్థానికుల సాయంతో పోలీసులు అతికష్టం మీద బయటకు తీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.




కారులో ఇరుక్కుపోయిన నారాయణస్వామిని బయటకు తీస్తున్న స్థానికులు

నేడు జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫాం, బీఫాం, పీజీ, డిగ్రీ, ఇంటర్, టెన్త్ విద్యార్హతగల నిరుద్యోగ యువత పాల్గొనవచ్చునని వారు పేర్కొన్నారు. 73 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా ఆరోగ్యమాత ఊరేగింపు





ఊరేగింపులో విశ్వాసులు (ఇన్‌సెట్) తేరుపై ఆరోగ్య మాత

కడప కల్చరల్ : మరియతల్లి జయంతి కోసం ఎంతో ఉత్సాహభరితంగా ఎదురుచూసిన విశ్వాసులకు గురువారం కన్నుల పండుగ. ఎంతో వైభవంగా మరియ తల్లి, జిల్లా ప్రజలకు దర్శనాన్ని, వరాలను అనుగ్రహించిందని, భక్తి విశ్వాసాలతో మరియ తల్లిని దర్శించుకున్న వారికి పాప ప్రక్షాళన చేకూరుతుందని ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ ఎండి ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మరియాపురంలోని సెయింట్ మేరీస్, క్రెథిడల్ చర్చి నందు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా క్రెథిడల్ విచారణ గురువులు తాళ్ల లాజర్ ప్రత్యేక దివ్యబలి పూజను సమర్పించారు. అనంతరం పురవీధుల గుండా మరియతల్లిని తేరుపై, ఎండి ప్రసాద్ రావు, విల్సన్, తిరుణాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వరుస క్రమంలో క్రమశిక్షణగా భక్తి గీతాలను ఆలాపిస్తూ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆరాధన, స్తుతి ప్రార్థనలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మరియ తల్లి జయంతి సందర్భంగా ఉదయం 8 గంటలకు కడప అపోస్తులిక పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. తర్వాత కానుకల సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పతాక అవరోహణతో ఆరోగ్యమాత మహోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముసిడోరియన్, డాన్ బోస్కో మరియాపురంలోని వివిధ సంస్థల గురువులు ఆరోగ్యమాత, క్రెథిడల్ మదర్లు, తిరుణాల కమిటీ సభ్యులు డాన్ బోస్కో విద్యార్థులు, వింసెంట్, క్రైస్తవ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వేస్టేషన్ పరిధిలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అలా జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ ఆదేశించారు. కడప నగరంలో రెండు రోజుల క్రితం గూడ్స్ రైలు పట్టాలు తప్పిన నేపథ్యంలో ఆయన గుంతకల్లు అధికారుల బృందంతో కలిసి గురువారం ఇక్కడికి వచ్చారు. కడప రైల్వేస్టేషన్‌తోపాటు అధికారుల బృందం భాకరాపేట వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. అలాగే నంద్యాల డెమూ ప్రమాదం జరిగిన తీరును సంఘటనా స్థలానికి వెళ్లి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రైల్వేస్టేషన్‌లో పదే పదే ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా సిగ్నలింగ్, ఇంజినీరింగ్, ట్రాఫిక్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రమాదం జరిగిన రెండు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు కడప రైల్వేస్టేషన్‌లోనే విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరును గురించి ఒక్కొక్కరిని పిలిచి విచారణ చేశారు. ఈ విచారణ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారని తెలిసింది. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఈఎన్ ఆకిరెడ్డి, సీనియర్ డీఈఎన్ సౌత్ అభిరామ్, ఏడీఎన్ రాధాకృష్ణ, ఏఎస్‌టీఈ కాత్యాకుమార్, స్టేషన్ మేనేజర్ నరసింహారెడ్డి, సీసీఐ జనార్దన్ కడప రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, జీఆర్పీ సీఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రైల్వేబ్రిడ్జి పనుల పరిశీలన

ముద్దనూరు : ముద్దనూరు–మంగపట్నం రైల్వేలైన్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పునర్నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి పనులను డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పరిశీలించారు. బ్రిటీషర్ల పాలనా కాలంలో ముద్దనూరు శివారులో భారీ ఇనుప కమ్మీలతో రైల్వే బ్రిడ్జి నిర్మించారు. వీటికి కాలం చెల్లడంతో ప్రస్తుతం ఇనుప దిమ్మెలను తొలగించి వాటి స్థానంలో సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సగం నిర్మాణం పూర్తి కావడంతో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని డీఆర్‌ఎం ఆదేశించారు.

కాలానుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి

చెన్నూరు : మారుతున్న కాలానుగుణంగానే ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం అవుతుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం చెన్నూరు గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజులపాటు జరిగే ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగవ రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటే సత్ఫలితాలను ఇస్తుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పనిసరిగా పాఠశాలల్లో నేర్పించాలన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు, ట్రైనింగ్ ఇంచార్జి పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో సరైన విద్యాభ్యాసం అందాలన్నారు. ఎఎంఓ ధనలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో గ్రేడ్-1, 2 టీచర్స్ కోసం 60రోజుల ఎఫ్ఎల్ ఎన్ శిక్షణ కార్యక్రమాలను డీఆర్‌పీలకు ఇస్తున్నట్లు తెలిపారు. కడపలో ప్రస్తుతం రెండవ విడత శిక్షణ జరుగుతోందన్నారు. ప్లానింగ్–ఎంఐఎస్ కో ఆర్డినేటర్ పి.లక్ష్మీనరసింహరాజు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యను పటిష్టం చేయడానికి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణను 1, 2 స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జీసీడీఓ విజయలక్ష్మి, ప్రకాశం జిల్లా సమగ్రశిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్, ఏఏఎంఓ రామంజులు రెడ్డి, కేఆర్‌పీలు, సమగ్ర శిక్ష సిబ్బంది, ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.